# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- విజయవాడ – సింగపూర్ మధ్య నవంబర్ 15 నుండి ఇండిగో విమాన సర్వీస్ ప్రారంభం కానుందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- పప్పు ధాన్యాల ఉత్పత్తులలో స్వయం సమృద్ధి సాధించి రైతులు దేశానికి ఆదర్శంగా నిలవాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆకాంక్షించారు.
- ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్కరణలు, చేస్తున్న అభివృద్ధి ఫలితంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.
- వెస్టిండీస్ తో ఢిల్లీలో జరుగుతున్న రెండవ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ తొలి ఇన్నింగ్స్ ను 518 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది.

========================

విజయవాడ – సింగపూర్ మధ్య నవంబర్ 15 నుండి ఇండిగో విమాన సర్వీస్ ప్రారంభం కానుందని పౌర విమానయాన శాఖా మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. వారానికి మూడు సార్లు మంగళ, గురు, శనివారాల్లో విజయవాడ నుండి సింగపూర్ లోని ఛాంగీ విమానాశ్రయాల మధ్య ఈ సర్వీసు ఉంటుందని పేర్కొన్నారు. ప్రవాసాంధ్రుల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు.. వంద రోజుల్లోనే సర్వీసును ఏర్పాటు చేశామని చెప్పారు. భవిష్యత్ లో కోటి మందికి పైగా ప్రవాసాంధ్రులు ప్రయాణాలు జరిపే అవకాశం ఉండటంతో అంతర్జాతీయ అనుసంధానాన్ని మరింత విస్తృతం చేస్తామని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

========================

పప్పు ధాన్యాల ఉత్పత్తులలో స్వయం సమృద్ధి సాధించి రైతులు దేశానికి ఆదర్శంగా నిలవాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ రోజు ఆయన రైతులతో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యవసాయ రంగ ప్రగతికి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. రైతులు మూడవ పంటగా పప్పు ధాన్యాలు పండిస్తే ఆ రంగంలో కూడా భారతదేశం అగ్రస్థానంలో నిలుస్తుందని పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

========================

ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని జె.పంగులూరు మండలం కొండమంజులూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు సైకిళ్లను మంత్రి ఈ రోజు పంపిణీ చేశారు. 15 లక్షల రూపాయలతో నిర్మించిన రసాయన శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో పలు సంస్కరణలు చేపడుతుందని అన్నారు.

========================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంస్కరణలు, చేస్తున్న అభివృద్ధి ఫలితంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో 30 కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మురుగు శుద్ధి ప్లాంటును రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిసి ఆయన ఈ రోజు ప్రారంభించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, కాలువల నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. తగ్గిన జీఎస్టీ రేట్లపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు.

========================

ఉప్పాడ తీర ప్రాంతంలో కాలుష్య నియంత్రణకు సత్వర చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఉపముఖ్యమంత్రి దృశ్య మాధ్యమ విధానంలో ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. కాలుష్య నియంత్రణ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఇటీవల కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాటా.. మంతి కార్యక్రమంలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

========================

స్త్రీ శక్తి - ఉచిత బస్సు పథకం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.... స్త్రీలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని అన్నారు. ఉచిత బస్సు పథకం ద్వారా అన్ని రంగాలలో ఉన్న మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వం అందించిందని పేర్కొన్నారు.

విరామం

========================

పోషక విలువలతో కూడిన సేంద్రీయ పప్పు ధాన్యాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయాధికారిణి, శాస్త్రవేత్త డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలోని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఈ రోజు రైతులతో కలసి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ప్రధానమంత్రి చేతుల మీదుగా జరిగిన ఈ పథకాల ప్రారంభోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... 24 వేల కోట్ల రూపాయలతో చేపట్టే ఈ పథకంలో కోటీ 70 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. 6 సంవత్సరాల పాటు ఈ పథకం అమలవుతుందని ఆమె వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

నెల్లూరు నగరంలో మైపాడు గేట్ సెంటర్ లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ బజార్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొద్దిసేపటి క్రితం దృశ్య మధ్యమ విధానంలో ప్రారంభించారు. మొదటి దశలో 120 దుకాణాలను ఏర్పాటు చేశారు. మహిళలు వ్యాపారవేత్తలు కావాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ఈ తరహా స్మార్ట్ స్ట్రీట్ దుకాణాలను ఏర్పాటు చేస్తామని పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ ఈ సందర్భంగా తెలిపారు.

========================

విశాఖపట్టణం నగరంలో `యువగళం మాదక ద్రవ్య వ్యతిరేక, గ్లో థీమ్ పార్కు` నిర్మాణ పనులను దృశ్య మాధ్యమ విధానంలో పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు  రామ్మోహన్ నాయుడు ఈ రోజు ప్రారంభించారు. VMRDA సమావేశమందిరం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (వి.ఎం.ఆర్.డి.ఎ) సెంట్రల్ పార్క్ లో సుమారు 2 ఎకరాల స్థలంలో 3 కోట్ల 50 లక్షల రూపాయలతో ఈ పార్క్ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... అత్యంత శక్తివంతమైన యువత పెడదోవ పట్టకుండా ఈ పార్కు  ఉపయోగపడుతుందన్నారు. ఈ పార్క్ విశాఖకు ప్రత్యేక గుర్తింపు తెస్తుందని తెలిపారు.

========================

జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. `సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్` పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈ రోజు ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ వస్తువుల ప్రదర్శనను కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి మంత్రి సందర్శించారు. ప్రదర్శనలో ఉంచిన ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులపై తగ్గిన ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... జీఎస్టీ వల్ల పలు వస్తువులపై ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్ర ప్రభుత్వానికి 8 వేల కోట్ల రూపాయల మేర ఆదాయం తగ్గుతుండగా, ఆ మేరకు ప్రజలకు లబ్ధి కలుగుతుందన్నారు.

========================

భారత్ వెస్టిండీస్ పురుష జట్ల మధ్య ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా రెండవ టెస్ట్ మ్యాచ్ లో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 518 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. 318 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో ఈరోజు ఉదయం ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ ప్రారంభంలోనే యశస్వి జైస్వాల్ వికెట్ కోల్పోయినప్పటికీ కెప్టెన్ శుభ్ మన్ గిల్ 129 పరుగుల అజేయ శతకంతో రాణించడంతో భారత్ 518 పరుగులు చేయగలిగింది. అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ రవీంద్ర జడేజా ధాటికి రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 140 పరుగులు మాత్రమే చేసింది. ఇంకా 378 పరుగుల వెనుకంజలో ఉంది.

========================

దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్ పరిసర ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్, యానాంలో రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారిణి జి.లక్ష్మి తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=========================
=========================